# వ్యాస కౌముది



**మనభారతం** **డా.వల్లూరుపల్లి శివాజీరావు**

81

**తొలి మాట:** *ప్రపంచ పాఠకులను విశేషంగా ఆకర్షించి, ఆకట్టుకుని, వారిచేత ఆదరించబడుచున్న, అసమాన తెలుగు మాస పత్రిక "**కౌముది**' లో ప్రచురితమైన నా 'మనభారతం' వ్యాసం జనవరి 2010 నుండి డిసెంబర్ 2015 వరకు నిరాటంకంగా 72 నెలలు ప్రచురితమయింది.* కాని సమయాభావం వల్ల జనవరి 2016 నుంచి కొన్ని బాధ్యతలవల్ల ఈ వ్యాసాలు కొనసాగించుటకు వీలుకాలేదు.

*ఇప్పుడు సమయం దొరికినందువల్ల 'కిరణ్ ప్రభ' గారి సమ్మతితో భారత విశేష చరిత్ర ను ప్రతిబింబించే ఈ 'మన భారతం' వ్యాసం మళ్ళీ కొనసాగిస్తున్నాను.*

## చేజారిన భారతదేశ రత్నరాజములు-10

### నాసిక వజ్రం

### నాస్సక్ వజ్రం (Nassak Diamond)



కొల్లూరు-పరిటాల వజ్ర గనుల ద్వయం నుంచి బయల్పడిన మరో అద్భుత వజ్ర రాజం "**నాసిక వజ్రం**". ఇప్పటి వరకు లభించిన ఆధారాల ప్రకారం ఈ వజ్రం 15 వ శతాబ్దంలో కొల్లూరు గనుల నుండి వెలికి తీయటం జరిగింది. ఈ వజ్రాన్ని ప్రపంచం లో నస్సాక్ వజ్రం (**Nassak** Diamond) గా పేరొందింది. 'నాసిక' పదం రూపాంతరం చెంది 'నస్సాక్' గా మారింది.

**నాసిక్, త్రింబక్, త్రయంబకేశ్వరాలయం**

1500 నుండి1817 వరకు ఈ వజ్రం మహారాష్ట్ర లోని నాసిక్ (Nassik, Naasik) కు 28 కి.మీ. దూరంలో ఉన్న "త్రింబక్" లో ఉన్న త్రయంబకేశ్వర (Trimbakeswara) దేవాలయంలోని శివ లింగానికి అలంకరించిన కిరీటంలో ఒక భాగమై దేదీప్య మానంగా భాసిస్తూఉండేది.

భారతదేశం లోని 12 పవిత్ర శివ జ్యోతిర్లింగాలలో ఒకటయిన పరమ పవిత్రమయిన ఈ త్రయంబకేశ్వ రాలయం బ్రహ్మగిరి, నీలగిరి, కాలగిరి పర్వతాల మధ్యలో ఉంది. త్రింబక్ పట్టణం గురించి శక్తి వంతమైన, అమరత్వాన్ని, దీర్ఘాయుష్యాన్ని ప్రసాదించే "మృత్యుంజయ" మంత్రం లో పేర్కొనబడింది.

రామాయణకాలంలో సీత, లక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు దండకారణ్యంలో అనేక సంవత్సరాలు నివసించి వేలాది రాక్షసులను సంహరించాడు. నాసిక్, త్రింబక్ పట్టణాలు ఈ దండకారణ్యంలోనివే. త్రింబక్ లో ప్రసిద్ధమైన "కుశావర్త కుండం". ఉంది. ఈ కుండంలో స్థానమాచరిస్తే పాప ప్రక్షాళనమవుతుందని భక్తులు నమ్ము తారు. సహ్యాద్రి కనుమలలో ఉద్భవించిన గోదావరి మహానది ఈ కుశావర్త కుండం ద్వారానే తన 1465 కి.మీ. (910 మైళ్ళు) ప్రయాణం కొనసాగిస్తుంది. త్రింబక్ పట్టణం పవిత్రమైన పురాతన నాసిక్ (నాశిక్) నగరానికి దగరలో ఉన్నందువల్ల ఉన్న ఈ 89 కారెట్ల వజ్రం "**నాసిక** వజ్రం" గా పేరు గాంచింది.

**నాసిక వజ్రం సుదూర ప్రయాణం**

1817-1818 లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ-మరాఠా రాజుల మధ్య జరిగిన మూడవ ఆంగ్లో-మరాఠా యుద్ధంలో మరాఠాలు ఓడిపోయారు. ఫలితంగా భారతావనిలోని అత్యధిక భాగం ఆంగ్లేయుల స్వాధీనమైంది.

ఈ యుద్ధ కాలంలో శివ లింగాన్ని అలంకరించిన నాసికా వజ్రం అదృశ్యమైంది. ఈ దశలో మరాఠా చివరి పీష్వా (Peshwa; రాజు) బాజీ రావు II (Baji Rao II) 5 నెలలు పాటు అదృశ్యమయ్యాడు. ఆయన వెంట విలువైన సంపదతో పాటు నాసిక వజ్రం కూడా ఉంది. తరువాత బ్రిటిష్ సైనికులకు లొంగిపోయినప్పుడు ఆంగ్లేయులతో జరిగిన సంధి ఒడంబడికలో భాగంగా బాజీ రావు II **నాసిక** వజ్రాన్ని బ్రిటిష్ సైన్యానికి చెందిన కల్నల్ J. Briggs కు సమర్పించుకున్నాడు. ఇతను ఈ వజ్రాన్ని తన పై అధికారి, బ్రిటిష్ సేనాధిపతి Francis Edward Rawdon-Hastings (1st Marquess of Hastings), స్వాధీనం చేసాడు.

మరాఠీల మీద సాధించిన విజయానికి ప్రతీకగా Rawdon-Hastings అనంత సంపదతోపాటు ఈ నాసిక వజ్రాన్ని కూడా ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులకు సమర్పించాడు. ఈ కంపెనీ 1818 లో నాసిక వజ్రాన్ని లండన్ విపణి వీధి (మార్కెట్) లో అమ్మటానికి లండన్ కు పంపించింది. అమ్మటానికి పెట్టినప్పుడు ఈ వజ్రం 89 కారెట్లు (17.8 గ్రాములు) ఉన్నట్లుగా నిర్ధారించబడింది.

ఆ దశలో కొంత గరుకుగా, కాంతి తక్కువగా ఉండి, పూర్తి త్రికోణ రూపంలో లేని ఈ వజ్రాన్ని లండన్ లోని వజ్రాల వ్యాపార కంపెనీ Rundell and Bridge కి 3,000 పౌండ్లకు (ఇప్పటి 215,000 పౌండ్లకు సమానం) అమ్మటం జరిగింది.

1837 లో ఈ వజ్రాల కంపెనీ ఒక వజ్రాల నిపుణుడిని పిలిచి నాసికా వజ్రం లో ఉన్న లోపాలను తొలగించి కాంతిని వెదజల్లే వజ్రంగా మార్చమని ఆదేశించింది. ఫలితంగా అతను చాలా ప్రయత్నించి చివరకు దీని పరిమాణం 10 శాతం తగ్గించాడు. అప్పుడు ఈ వజ్రం పరిమాణం 78.625 కారెట్లు (15.725 గ్రాములు) కు తగ్గింది.

1831 లో Rundell and Bridge వజ్రాల కంపెనీ నాసిక వజ్రాన్ని ఇమ్మాన్యుయేల్ సోదరులకు (Emmanuel Brothers) 7,200 పౌండ్ల (ఇప్పటి వెల 642,000 పౌండ్లు) కు అమ్మింది. 6 సంవత్సరాల తరువాత (1837 లో) ఇమ్మాన్యుయేల్ సోదరులు ఈ వజ్రాన్ని లండన్ లోని Robert Grosvenor (1st Marquess of Westminster) కు అమ్మారు. ఈయన మన నాసిక వజ్రాన్ని తన ఖడ్గం పిడిలో అమర్చాడు. 1866 లో ఈవజ్రం

విలువ 30,000--40,000 పౌండ్లు (ఇప్పటి వెల 3,210,000--4,280,000 పౌండ్లు) మధ్య ఉన్నదని నిర్ణయించ బడింది. ఇంత విలువ ప్రముఖంగా ఇది వెదజల్లే కాంతి వల్లనే.

1st Marquess of Westminster వంశీకుడు Duke of Westminster 1927 లో నాసిక వజ్రాన్ని అమెరికాలో నివసిస్తున్న పారిస్ వజ్రాల వ్యాపారి George Mauboussin కు అమ్మాడు. ఈయన న్యూయార్క్ లోని తన Park Avenue వజ్రాల షాపులో ఈ వజ్రాన్ని ఉంచాడు. 1929 జనవరిలో ఈ వజ్రాల షాపును దొంగలు అనేక బంగారు ఆభరణాలను, వజ్రాలను దొంగిలించారు. కాని నాసిక వజ్రం ఒక మురికగా ఉన్న కవరు (envelope) లో ఉన్నందువల్ల దొంగలు దీనిని వదిలేశారు.

ఈ మొదటి దోపిడీ ప్రయత్నం తరువాత మరొకసారి ఈ అంతర్జాతీయ దొంగలు మార్చి 1930 లో నాసిక వజ్రాన్ని దొంగిలించాలని చేసిన మరొక ప్రయత్నం ఫలించలేదు. వెంటనే ఈ న్యూయార్క్ కంపెనీ నాసిక వజ్రాన్ని భీమా (insurance) చేయించింది. అప్పుడు దీని విలువ 400,000--500,000 డాలర్లు గా (ఇప్పటి విలువ 6.0--7.5 మిలియన్ డాలర్లు) నిర్ణయించబడింది. ఆసమయం లో త్రికోణాకారం లో పొడుగుగా ఉన్న నాసికా వజ్రం "ఏచిన్న మచ్చ కుడా లేని, అసామాన్య, అద్భుతమైన కాంతిని వెదజల్లే, స్పష్టమైన, స్వచ్ఛమైన మెరుపును స్వంతం చేసుకున్న మణిరాజం" అని కీర్తించబడింది.

1933లో చికాగోలో జరిగిన ప్రపంచ ప్రదర్శనలో "నాసిక వజ్రం అత్యుత్తమ వజ్ర రాజం" అని నిర్ణయిం చబడింది. 1940 లో అమెరికన్ వజ్రాల వ్యాపారి హారి విన్స్టన్ (Harry Winston) పారిస్ లో నాసిక వజ్రాన్ని కొని దాని పరిమాణం తగ్గించటానికి కోయించాడు. ఫలితంగా ఏ మాత్రం మచ్చలేని 43.38 కారెట్లు (8.676 గ్రాములు) ఉన్న వజ్రంగా తయారైంది. 1942 లో హారి విన్స్టన్ చిన్న పరిమాణంలో ఉన్న నాసిక వజ్రాన్ని ఒక న్యూయార్క్ వజ్రాల వ్యాపారికి అమ్మాడు. ఈ నాసిక వజ్రాన్ని 1944 లో George Mauboussin స్నేహితుడు William Bateman Leeds, Jr. కొని దీనిని ఒక పెద్ద ఉంగరంలో అమర్చి తన భార్యకు 6 వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా బహూకరించాడు.

1964 లో Gemological Institute of America మన నాసిక వజ్రం అంతర్గతంగా ఏ చిన్న దోషము, కళంకం, మచ్చలేని అత్యద్భుతమైన కాంతిని వెదజల్లే వజ్రరాజమని ప్రస్తుతించింది.


ఏప్రిల్ 1970 లో నాసిక వజ్రం ప్రపంచంలో ఉన్న అత్యుత్తమ 30 వజ్రాలతో ఒకటి అని పేర్కొనబడింది. అదే నెలలో Edward J. Hand అనే సంపన్నుడు ఈ వజ్రాన్ని 500,000 డాలర్ల (ఇప్పటి వెల 3.23 మిల్లియన్ డాలర్లు) కు కొన్నాడు.

డిశంబర్ 1982 లో British Midland Airways కంపెనీ డచ్ విమాన సంస్థ KLM నుంచి ఒక DC-9 విమానాన్ని కొని దానికి "The Nassak Diamond" అని నామకరణం చేసింది!

ఈ రోజుకూడా త్రయంబకేశ్వర దేవాలయంలో ప్రతి సోమవారం మధ్యాహ్నం 4-5 గంటల మధ్య శివ లింగాన్ని అలంకరించే కిరీటంలో నాసిక వజ్రం ఉంచబడిన (స్థిరీకరించబడిన) స్థానంలో బంగారంతో పాటు వివిధ వజ్రాలు, పచ్చలు (emeralds), విలువైన రాళ్లు స్పష్టంగా చూడవచ్చు. ఈ దృశ్యం అద్భుతం, అపు రూపం, కనువిందుగా ఉంటుంది.

**కాని ఈ రత్నాల సముదాయం ద్వారా ఉద్భవించే మెరుపులు 200 ఏళ్ల ముందు వందలాది ఏళ్ళు నాసిక వజ్రం వెదజల్లిన అద్వితీయమైన, అసమానమైన, నిరుపమానమైన సౌందర్యం ముందు దిగదుడుపే అంటే అది ఏమాత్రం అతిశయోక్తికాదు. ఇది చారిత్రకులు వెలిబుచ్చిన అభిప్రాయమే గాని వేరు కాదు.**

దేముళ్ళకు అలరించబడిన కొల్లూరు-పరిటాల వజ్రాల గనులలో కనుగొనబడిన ఇతర భారత వజ్రాల వలె *నస్సాక్ వజ్రంగా* ప్రపంచ ప్రసిద్ధి పొందిన *మన నాసిక వజ్రం కూడా తెల్లజాతివారి పాలయింది*. ఇది మన భారతజాతి చేజార్చుకున్న మరొక అద్భుత సంపద!!







(వచ్చే నెలలో మరొక వజ్రం గురించి తెలుసుకుందాం)

**మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com**

COMMENTS